కథ లేకుండా పోవడం గురించి. కథ లేకపోవడం మహా కావ్య లక్షణం అవడం యాదృచ్ఛికమా? ఆవశ్యకమా? అని అడుగుతున్నారు నారా. ఈ కాలం కవిత్వం నుంచి కథ వైదొలగింది. ఇక మళ్ళీ మహా కావ్య లక్షణంలో కథ లేకపోవడం గురించి ఎందుకు చెప్పాలో అని నారా ప్రశ్నల అసలు ఉద్దేశం. వచన కవిత్వంలో కూడా కథా కావ్యాలు రావాలని కుందుర్తి వాదించేవారు. అందుకనుగుణంగా కొందరు వచన కవిత్వంలో కథలు రాశారు. (శీలా వీర్రాజు 'కొడిగట్టిన సూర్యుడు' ఒక ఉదాహరణ) సైజుని బట్టి వాటిని మహా కావ్యాలు అనుకొనే ప్రమాదం వుంది. అందువల్ల ఆధునిక మహా కావ్యంలో కథారాహిత్యాన్ని ఒక లక్షణంగా ప్రవేశ పెట్టడం. ఇది ప్రిస్క్రిప్టివ్‌గా ఉందంటారు నారా. నేనట్లా అనుకోవడం లేదు. ఇతర లక్షణాలు అస్తిత్వాన్ని చెపితే కథా రాహిత్యం నాస్తిత్వాన్ని చెపుతుంది. అంతే తేడా. అంత మాత్రాన్నే ఇది 'ప్రిస్క్రిప్టివ్' అయిపోదు.

ఇదే నిర్వచనంలో ''అనేక భావాలతో, మూడ్స్‌తో'' అనే ప్రయోగానికి అభ్యంతరం చెపుతూ 'భావాలకు, 'మూడ్స్‌కు' తవకు తేడా తెలియడం లేదన్నారు. ఉన్నా లేకపోయినా చింతలేదు. 'నా రచనలో శ్రద్ధ తక్కువయింది. అందువల్ల అపోహలు వచ్చాయి' అని చెప్పడం కోసం ఇది తార్కాణంగా ఉపయోగిస్తున్నారు. దీనివల్ల వచ్చిన అపోహ ఏమీ లేదు. మహా అయితే పునరుక్తి అవుతుంది. ఇంతకీ కాస్త తేడా ఉందనుకొనే వాడాను. 'మూడ్' కేవలం మనస్థితిని మాత్రమే సూచిస్తుంది. భావం ఇంతకన్నా విశాలమయింది. 'అతని మూడ్ బాగాలేదు' అనే వాక్యం ఈనాటి తెలుగులో 'అతని భావం బాగా లేదు' అన్న వాక్యానికి సమానం కాదు. సాహిత్య పరంగా భావం మూడ్‌కి ఇంకాస్త సన్నిహితమైంది. (పై వాక్యార్థాల్లో కన్నా) అయితే ప్రాచీన అలంకార శాస్త్రంలో భావం అనే మాట చాలా విస్తృతార్థంలో ప్రయుక్తమయింది. మనస్థితి కారణంగా వ్యక్తమయే శారీరక స్థితులకు కూడా భావం అనేమాట వాడారు. స్తంభము, ప్రళయము, రోమాంచము, స్వేదము... మొదలైన సాత్విక భావాలు దేహస్థితి సూచకాలు. అందువల్ల స్పష్టతకోసం భావాలు, మూడ్స్ అని వాడబడింది. శ్రద్ధారాహిత్యానికి దీన్ని ఉదాహరణగా తీసుకో అక్కర్లేదు.

నా శ్రద్ధాలోపానికి మరొక తార్కాణం చూపించారు నారా. 'కొయ్య గుర్రం' లో పాదుగు బలవంతాన సాగదీసిన పాదుగేవని నేను గుర్తించలేదన్నారు. అదే సందర్భంలో ''శ్రీ శ్రీగారి 'ఓ కవితా!' గీతంలో ఒక్క అక్షరం తీసెయ్యడానికి వీల్లేదు'' అన్నారు. ఈ రకమైన ప్రతిపాదనలలో గాని, పరిశ్రమలోగాని, వ్యక్తిగతమైన రుచుల ప్రమేయం ఎక్కువ. ఇట్లాంటివి రుజువు కావడం కష్టం. అయినా ప్రయోగం కోసం నారా గారు కొయ్య గుర్రాన్ని కుదించి తయారు చేస్తే అచ్చు వెయ్యడానికి 'ఆంధ్రజ్యోతి' వారికి అభ్యంతరం ఉండబోదనుకోను. కొయ్య గుర్రాన్ని పూర్తిగా అచ్చేసిన ప్రజాతంత్ర ఆంధ్రజ్యోతి కన్నా సైజులో చాలా చిన్నది.

ఇక కొయ్య గుర్రం సందేశం తాత్విక చింతన గురించి సరిగ్గా ఇక్కడే నిజంగావిభేదించడానికిబోలెడంత అవకాశం వుంది. కొయ్య గుర్రం ఇచ్చే సందేశం అన్ మార్క్సిస్టు అని తొలిసారిగా వివాదం జరిగిన రోజుల్లోనే నూతన పత్రికలో చేకూరి శ్రీనివాస విభేదించాడు. కొయ్య గుర్రం తాత్వికంగా దిగంబర కవిత్వపు పొడిగింపేనని నారా అంటున్నారు. దిగంబర కవిగా ఎక్కువ రచనలు చేసిన నగ్నముని ఇతర రచనలలో దిగంబర కవితా మార్గావశేషాలుకొన్ని మిగిలి వుండేఉండొచ్చుకాని అంత మాత్రాన దిగంబర కవిత్వానికి పొడిగింపేననడం అతిసాధారణీకరణం.


కొయ్య గుర్రంలో వర్గ సంఘర్షణ లేదు. అంత మాత్రం చేత (నేననుకునే) సందేశం లేదంటున్నారు. జరిగింది ప్రకృతి భీభత్సం. దీనికి ప్రభుత్వాలు ప్రత్యక్ష కారణాలు కాకపోవచ్చు. వ్యవస్థ కూడా ప్రత్యక్ష కారణం కాదు. అయితే జరగకుండా నిరోధించడానికి, జరిగిన తరువాత శవం మీద వ్యాపారం జరగడానికి గాని ఈ రెంటి బాధ్యత వుంది. ''కొయ్యగుర్రం స్థబ్దతకీ మూర్ఖతకీ, అజ్ఞానానికీ అహంకారానికీఅసమర్థ పరిపాలనకీ ప్రతీక''

అన్ మార్క్సిస్టుగా కనిపించేది చివర ఒక చోట వుంది... పాతరాతి యుగం పనిముట్లు పట్టుకుని పవిత్ర ఏకటి కోణాల గుహల్లోకి వెళ్ళిపోతాను'' అంటాడు. అయితే మార్క్సిస్టు కొలబద్దలకు సరిపోయే సందేశం కొయ్య గుర్రంలో అందనలేదు నేను. అసమర్థ పాలనం అంతం చెయ్యాలన్నంత వరకే ఆ సందేశం. మార్గాల విషయంలో విసుగెత్తిన కన్‌ఫ్యూషన్ చివరి ఖండికలో కనిపిస్తుంది.

విస్తీర్ణతను మించిన ప్రక్రియా భేదాన్నుద్దేశించి మహాకావ్యం అనే మాట వాడాను. విస్తీర్ణతే పరమావధి అయితే ఈ విభజనకు ప్రయోజనం లేకపోవచ్చు. ఒక వేళ నేను చెప్పిన ఒకటీ అరా లక్షణాలలో లోపం ఉన్నా, ఈ విభజన ప్రయోజన రహితం కాదు. నేను గుర్తించిన లక్షణాలను ఇంతకన్నా పటిష్టంగా చెప్పాల్సిన అవసరం వుంటే వుండొచ్చు. అంతమాత్రంచేత కొయ్య గుర్రం ఒట్టి 'లాంగ్ పోయం' అనడం రిడక్షనిజం'.

నారా తమ వ్యాసం చివర కొయ్య గుర్రం పీఠికకు ఒక 'పురచేతి ప్రశంస'ను దయచేశారు. అందులో గడసరితనాన్ని మెచ్చుకుంటున్నాను. గడుసైన వన్నీ నిజాలుకానక్కర్లేదు కదా!

చేరా






# కాలడం చాలని కథ

''కుమార్ పాన్‌షాప్'' దగ్గర జనం బాగా వున్నారు. సాయంకాలం సమయం మూలాన గుంపులుగా నిలబడి మాట్లాడుకునే విద్యార్థులు, వాకింగ్‌కు పోయే ముసలి వాళ్ళు, స్కూటర్లమీద సినిమాలకు పోయే పడుచు వాళ్ళతో ఆ రోడ్డు సందడిగా వుంది.

కిళ్ళీకొట్టులోని అబ్బాయి అష్టావధానం చేస్తున్నట్లుగా కనిపిస్తాడు. ఒక సూటువాలా కూల్‌డ్రింకు ఒకటి తాగి ''చేంజ్'' మని తేన్చి, ''ఇదిగో డబ్బులు'' అన్నాడు కొట్టు అబ్బాయితో. ''చిల్లర లేదు సార్, ఇదిగో వక్కపొడి ప్యాకెట్టు తీసుకోండి'' అంటూ కొట్టు అబ్బాయి తీసుకుంటే తీసుకోండి, లేకపోతే మానేయండి అన్నట్లుగా మరొకరి బేరం చూడసాగేడు.

''ఒక సిగరెట్టు ప్యాకెట్టు ఇవ్వు అబ్బాయి'' అన్నాడు మరొక ఆసామీ. సిగరెట్టు ప్యాకెట్టుతో పాటు మరొక అర ప్యాకెట్టు కూడ ఇచ్చాడు చిల్లరకు బదులుగా కొట్టు




ఇలా అసలు బేరాలుతో పాటు చిల్లర బేరాలు కూడ చేసుకుపోతూ రెండు చేతులా అమ్మేసి సొమ్ము చేసుకుంటున్నాడు కొట్టువాడు. అందరూ ఆరోజు తమకు చిల్లర మూలంగా ఎంత అనవసరపు ఖర్చు అయినదీ, ఎన్ని డబ్బులు నష్టపడినదీ లెక్కలు వేసుకుంటూ, చిల్లర జబ్బును తిట్టుకుంటూ పోతున్నారు.

ఒక ఏడు ఏళ్ళ పాప కొట్టుదగ్గరికి వచ్చింది.

''ఒక బ్రెడ్ ప్యాకెట్టు ఇయ్యండి'' అని అడిగింది.

కొట్టువాడు బ్రెడ్ ప్యాకెట్టు ఇచ్చాడు. ఆ పాప 'రూపాయి కాగితం' ఇచ్చింది.

''ఇంకొక పావలా ఇవ్వాలి'' అన్నాడు కొట్టువాడు.

''నా దగ్గర చిల్లర లేదు'' అని కొంచెమాగి చేతిలో వున్న చాక్‌లెట్ కొట్టువాడి బల్లమీద పెట్టి, ''ఈ చాక్‌లెట్ పావలాయే. ఇది నువ్వు తీసేసుకో పావలాకు బదులుగా'' అంటూ గెంతుకుంటూ వెళ్ళిపోయింది. కొట్టు అబ్బాయి తెల్లబోయి చూశాడు. అక్కడున్న జనం ఇది చూసి గొల్లుమని నవ్వారు.

—'శ్రీసత్య'